సాక్షి రంగారెడ్డి

మంగళవారం । 9 । సెప్టెంబర్ । 2025



పట్టించుకోరు..పరిష్కరించరు

సమస్యలు తీర్చాలని ఏళ్లుగా తిరుగుతున్నా పరిష్కారం కావడం లేదని బాధితులు ప్రజావాణికి బారులు తీరుతున్నారు. 8లో▸



కిడ్నీ రోగులకు వరం

మహేశ్వరం ప్రభుత్వ ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రం కిడ్నీ రోగులకు వరంగా మారింది. 8లో▸



ఆ స్తంభాలను తొలగించండి

తమ పొలంలో నాటిన స్తంభాలను తొలగించాలని ఓ రైతు పెట్రోల్ డబ్బాతో సబ్ స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశాడు. 8లో▸

న్యూస్‌రీల్

బాలాపూర్ గణనాథుడి హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఉత్సవ సమితి నిర్వాహకులు

బడంగ్‌పేట్: బాలాపూర్ గణనాథుడి హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. రూ.23,13,760 సమకూరినట్లు ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి తెలిపారు. కానుకలు సమర్పించిన భక్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తలిపారు.

జువాలజీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్‌రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ వికారాబాద్ మహిళా డిగ్రీ కళాశాలలో జువాలజీ బోధించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి జయ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీజీ పూర్తి చేసిన ఆసక్తిగల మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 10వ తేదీ లోపు ఒర్జినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల జిరాక్స్, బయోడేటా ఫాంతో తోల్‌కట్ట సమీపంలోని ఎస్‌వీ గ్రూప్ కళాశాలలో కొనసాగుతున్న వికారాబాద్ మహిళా కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్: వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని పంచాయితీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం షాద్‌నగర్ ఆర్డీఓ సరితను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీని నెరవేర్చాలని అన్నారు. రైతులకు కావాల్సిన యూరియాను వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు బుద్దుల జంగయ్య, రమేష్ యాదవ్, దామోదర్‌రెడ్డి, వెంకటయ్య, షేక్ ఉస్మాన్, కిష్టయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

'హైటెన్షన్' అలైన్‌మెంట్ మార్చాల్సిందే

బాధిత రైతుల దీక్షలు ప్రారంభం



దీక్షలో బాధిత రైతులు

కడ్తాల్: తాతలు, తండ్రుల కాలం నుంచి సేద్యం చేసుకుంటూ బతుకున్నామని, ఉన్న కొద్దిపాటి భూముల మీదుగా హైటెన్షన్ లైన్ వేస్తే ఎక్కడికి వెళ్లాలని బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో సోమవారం నిరవధిక దీక్షలు చేపట్టారు. ప్రాణాలు పోయినా సరే.. 765 కేవీ హైటెన్షన్ లైన్ తమ పొలాల మీదుగా వేయకుండా అడ్డుకుని తీరుతామని స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. సన్న, చిన్నకారు రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా వారి పొలాల మీదుగా పవర్ గ్రిడ్‌లైన్ తీసుకెళ్లడం అన్యాయమని మండి పడ్డారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దీక్షలకు మార్కెట్ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్‌నాయక్, బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, సింగిల్ విండో డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్ తదితరులు మద్దతు పలికారు.

ఆరోగ్య శాఖకు అవినీతి జబ్బు!

జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఇష్టారాజ్యం

- తనిఖీలు, నోటీసుల పేరుతో దందా
- అనుమతుల మాటున వసూళ్ల పర్వం
- కరువైన ఉన్నతాధికారుల పర్యవేక్షణ

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఫైర్‌సేఫ్టీ సహా అనుమతి లేని ఇరుకైన భవనాల్లో ఏర్పాటు చేసిన పలు ఆస్పత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. రోగుల సేవలో తరించాల్సిన కొంత మంది వైద్యాధికారులు ఆస్పత్రుల తనిఖీల పేరుతో అడ్డగోలు వ్యవహారాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కొత్తగా మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు, నర్సింగ్ హోంలు, క్లినిక్‌లకు అనుమతుల జారీ సహా పాత ఆస్పత్రులకు లైసెన్సుల పునరుద్ధరణ పేరుతో ఇలా నోటీసులు జారీ చేసి, అలా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. చిన్నచిన్న సాంకేతిక అంశాలను సాకుగా చూపించి, ఆస్పత్రి, పడకలు, స్కానింగ్ మిషన్లు, లేబోరేటరీల నిష్పత్తిని బట్టి వసూలు చేస్తున్నారు. ఆస్పత్రి నిర్వాహకులు చేసేది లేక వారు అడిగినంత ఇచ్చుకుంటున్నారు. పెట్టిన పెట్టుబడిని మళ్లీ సంపాదించుకునేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. అర్హత, అనుభవం లేకపోయినా గుట్టుగా అవయవమార్పిడి, సంతాన సాఫల్యం వంటి ఖరీదైన చికిత్సలు చేస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఎప్పటికప్పుడు అధికారుల పనితీరుపై నిఘా పెట్టాల్సిన జిల్లా ఉన్నతాధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో అక్రమార్కులు ఆడిందే ఆట పాడిందే పాట అన్నట్లు తయారైంది.



భారీగా ముడుపులు

జిల్లాలో స్పెషాలిటీ, మల్టీ స్పెషాలిటీ, జనరల్ నర్సింగ్‌హోమ్‌లు, క్లినిక్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్లు మూడు వేలకుపైగా ఉన్నట్లు అంచనా. వీటిలో 2,500 వరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నుంచి అనుమతులు పొందాయి. మరో 400 వరకు ఎలాంటి అనుమతులు లేని క్లినిక్‌లు ఉన్నట్లు అంచనా. అర్హతలు, అనుమతులు లేకుండా చికిత్స చేస్తున్న ఆస్పత్రులు, వైద్యులపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ వరుస దాడులు చేస్తున్న విషయం తెలిసిందే. ఆయుర్వేద, యునానీ కోర్సులు చేసిన వారు అల్లోపతి వైద్యులుగా.. ఆర్‌ఎంపీలు ఎంబీబీఎస్ వైద్యులుగా చలామణి అవుతున్నారు. ప్రాథమిక వైద్య సేవలు అందించాల్సిన చోట ఇన్‌పేషంట్లకు చికిత్సలు అందిస్తున్నారు. అబార్షన్లతో పాటు కుటుంబ నియంత్రణ, సుస్తీ వంటి చికిత్సలు చేస్తున్నారు. అధిక రక్తస్రావం సహా ఇతర కారణాలతో ఆయా బాధితులు మృత్యువాతపడుతున్నారు. ఇలాంటి నకిలీ వైద్యులను, ఆస్పత్రులను తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ప్రతినిధులు గుర్తించి, కేసులకు సిఫార్సు చేస్తోంది. ఆ బాధ్యతను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు అప్పగిస్తోంది. ఆయా ఆస్పత్రులను తాత్కాలికంగా సీజ్ చేస్తున్నారు. ఆస్పత్రుల లైసెన్సులు రద్దు చేయక పోగా, కొద్ది రోజులకే వాటిని తిరిగి తెరిపిస్తున్నారు. ఇందుకు ఒక్కో ఆస్పత్రి నుంచి భారీగా ముడుపులు ముడుతున్నట్లు తెలిసింది. కందుకూరు, షాద్‌నగర్ డివిజన్ల పరిధిలో అక్రమ వసూళ్ల దందా యథేచ్ఛగా జరుగుతున్నట్లు సమాచారం. డిప్యూటేషన్లపై అడ్డదారిలో వచ్చిన ఓ వైద్యురాలు.. గడువు ముగిసిన తర్వాత కూడా ఇక్కడే డిప్యూటీ డీఎంహెచ్‌ఓగా కొనసాగుతూ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి.

ఒకరి పేరున.. మరొకరు

నిజానికి ఏ వ్యక్తి పేరునైతే ఫార్మసీ, ల్యాబ్‌లకు లైసెన్స్ పొందుతారో ఆ వ్యక్తి విధిగా అందుబాటులో ఉండాలి. కానీ మెజార్టీ కేంద్రాల్లో ఫార్మాసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు అందుబాటులో ఉండటం లేదు. కనీస అర్హత లేని వారితో రక్త, మూత్ర వైద్య పరీక్షలు చేయిస్తున్నారు. వైద్యుల ప్రిస్కిప్షన్ లేకుండానే అటెండర్లు మందులు ఇచ్చేస్తున్నారు. కీలకమైన స్కానింగ్ సెంటర్లలోనూ ఇదే పరిస్థితి. రేడియాలజిస్టుకు బదులు ఎక్సరే టెక్నీషియన్లు, స్టాఫ్ నర్సులతో పరీక్షలు చేయిస్తున్నారు. కడుపులో ఉన్నది ఆడో మగో ముందే చెబుతూ పరోక్షంగా అబార్షన్లకు కారణమవుతున్నారు. జిల్లాలో 700పైగా స్కానింగ్ సెంటర్లు ఉండగా, వీటిలో మెజార్టీ సెంటర్లలో కనీస అర్హత ఉన్నవారు లేరంటే ఆశ్చర్యపోనవసరం లేదు. మూడు నెలలకోసారి మెడికల్ షాపుల నుంచి అసోసియేషన్ ప్రతినిధులే వసూలు చేసి డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు ముడుపులు ముట్టజెబుతున్నట్లు తెలిసింది.



మొక్క.. డివైడర్ మధ్య ఎంచక్కా..

హైదరాబాద్–శ్రీశైలం ప్రధాన రహదారితో పాటు కందుకూరు చౌరస్తా నుంచి గ్రామం వరకు మధ్యలో ఉన్న డివైడర్‌లో మొక్కల పెంపకానికి హెచ్‌ఎండీఏ శ్రీకారం చుట్టింది. నాలుగు రోజులుగా కూలీలతో గన్నేరు వంటి పూల మొక్కలతో పాటు రకరకాల మొక్కలు నాటే పని చేపట్టారు.

– కందుకూరు

రైతుల ప్రయోజనాలే ముఖ్యం



బత్తాయి యార్డును సందర్శించి రైతులతో మాట్లాడుతున్న కోదండరెడ్డి తదితరులు

- గిట్టుబాటు ధర కల్పించే బాధ్యత మార్కెట్ కమిటీలదే
- రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: రైతుల ప్రయోజనాల కోసమే మార్కెట్ కమిటీలు పని చేయాలని, మార్కెట్‌కు రైతులు తెచ్చే సరుకుకు గిట్టుబాటు ధర కల్పించే బాధ్యత వాటిపైనే ఉంటుందని వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి స్పష్టం చేశారు. బాటసింగారంలోని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్‌ను సోమవారం ఆయన సభ్యులతో కలిసి సందర్శించారు. బత్తాయి రైతులతో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మార్కెట్ కమిటీతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం రైతు సంక్షేమం కోసమే పని చేస్తోందని అన్నారు. ఉద్యాన పంటలను ప్రోత్సహిస్తోందని తెలిపారు. అన్ని మార్కెట్ కమిటీల పనితీరును సమీక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. కోహెడలో ఏర్పాటు చేయబోయే మార్కెట్ నిర్మాణం త్వరలోనే ప్రారంభమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో రైతు కమిషన్ సభ్యుడు సునీల్ రెడ్డి, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కర్‌చారి, డైరెక్టర్లు, మార్కెట్ ఈఈ ప్రసాద్‌రావు, ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎల్. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

పింఛన్లు పెంచే దాకా పోరాటం

- పాతవి పెంచరు.. కొత్తవి ఇవ్వరు
- హామీల అమలులో ప్రభుత్వం విఫలం
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

ఇబ్రహీంపట్నం రూరల్: పెంచుతామని చెప్పిన పింఛన్లు పెంచకుండా, కొత్తవి మంజూరు చేయకుండా రేవంత్‌రెడ్డి సర్కార్ వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులను మోసం చేస్తోందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ మండిపడ్డారు.పెన్షన్లు పెంచాలని కోరుతూ వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు వికలాంగులకు రూ.6వేలు, ఆసరా పెన్షన్ రూ.4వేలు, తీవ్ర వైకల్యం గల వికలాంగులకు రూ.15వేలు ఇస్తామని హామీ ఇచ్చి మాట తప్పారన్నారు. ప్రశ్నించాల్సిన ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ అసెంబ్లీకి పోడు, ప్రజల్లోకి రాడని విమర్శించారు.పింఛన్ల పెంపుకోసం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.అనంతరం కలెక్టర్ నారాయణ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, కార్యదర్శి నాగార్జున శ్రీనివాస్‌చారి, ఉపాధ్యక్షులు వరికుప్పల వెంకటేష్, యాచారం జంగయ్య పాల్గొన్నారు.

పేదల బాధలు పట్టడం లేదు

కందుకూరు: ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు పెంచడమో, సీఎం గద్దె దిగడమో తేలే వరకు పోరాడతామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. మండల కేంద్రంలోని టంకరి రాంరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో సోమవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటు సీఎం రేవంత్‌రెడ్డి, అటు మాజీ సీఎం కేసీఆర్ భూస్వామ్య కుటుంబాల నుంచే వచ్చారని, అందుకే పేదల బాధలు వారికి పట్టడంలేదని మండిపడ్డారు. అర్హులందరూ తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఎక్కడికక్కడ ధర్నాలు చేయాలని, ప్రభుత్వం ఎందుకు దిగిరాదో చూద్దామన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు రావుగళ్ల బాబు మాదిగ, మాజీ సర్పంచులు మంద సాయిలు, మస్కు బాబు, టి.దేవేందర్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకోవాలి

షాద్‌నగర్‌రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్లు పెంచాలని లేదంటే పోరాటం ఆగదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. పట్టణంలోని గౌరీ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం వికలాంగులు, చేనేత, బీడీ, నేత కార్మికులకు పెన్షన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ మహాగర్జన సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ.. ఈనెల 12న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కార్యాలయాల ఎదుట ధర్నా, 20న హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారి దిగ్బంధనం, 21 నుంచి 26తేదీ వరకు పంచాయతీల ఎదుట నిరసన, 27న రాష్ట్ర వ్యాప్తంగా రహదారుల దిగ్బంధనం చేస్తామని వెల్లడించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉపేందర్, జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

మరకత శివాలయంలో సినీనటుడు సురేశ్ పూజలు

శంకర్‌పల్లి: మండలంలోని చెందిప్ప గ్రామంలో వెలసిన 11వ శతాబ్దపు మరకత శివాలయాన్ని సోమవారం సినీ నటుడు సురేశ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరంసురేశ్ మరకత లింగానికి పాలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు.

ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలి

ఆమనగల్లు: ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ వెంటనే మార్చాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.జంగారెడ్డి డిమాండ్ చేశారు. సన్న, చిన్నకారు రైతుల భూములను ఆక్రమించుకుని రోడ్డు నిర్మిస్తా రా అని ప్రశ్నించారు. పట్టణంలో సోమవారం ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి మండలాలకు చెందిన పలువురు రైతులు వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ ఫయాం ఖాద్రికి వినతిపత్రం అందించారు. అంతకుముందు హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై రాజీవ్ చౌరస్తా వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా జంగారెడ్డి మాట్లాడుతూ.. వందల ఎకరాలు ఉన్న భూస్వాముల భూములను కాపాడటం కోసం సన్న, చిన్నకారు రైతుల భూముల్లో రోడ్డు నిర్మించడం ఎంతవరకు సబబని అన్నారు. రాష్ట్రంలో పేదల ప్రభుత్వం, రైతు ప్రభుత్వం ఉందని చెప్పుకొంటున్న నేతలు పేద రైతుల భూములను ఎందుకు లాక్కుంటున్నారని నిలదీశారు. నిరుపేద రైతులకు అన్యాయం జరగకుండా అలైన్‌మెంట్ రూపొందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రామచందర్, జిల్లా నాయ కుడు పగడాల యాదయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య, ఉపాధ్యక్షుడు కానుగుల వెంకటయ్య పాల్గొన్నారు.




ఆమనగల్లులో రాస్తారోకో చేస్తున్న నాయకులు, రైతులు

హెచ్‌ఎండీఏ కార్యాలయంలో వినతి

కొందుర్గు: ప్రభుత్వం ఇటీవల వెలువరించిన ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ ప్రతిపాదనను మార్చాలని మండల పరిధిలోని తంగెళ్లపల్లి గ్రామస్తులు సోమవారం హైదరాబాద్‌లోని హెచ్‌ఎండీఏ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిపాదించిన అలైన్‌మెంట్‌తో తమ గ్రామానికి చెందిన చాలామంది పేదల భూములు పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో మాజీ సర్పంచ్ బాల్‌రాజ్, రవీందర్ రెడ్డి, శేఖర్, పెరుమాల్ రెడ్డి, శ్రీశైలం, పోచయ్య, వెంకటేశ్‌గౌడ్ ఉన్నారు.

గ్రేటర్ కేడర్‌కు పెద్దపీట

బీజేపీ రాష్ట్ర కార్యవర్గంలో సముచిత స్థానం



సాక్షి, రంగారెడ్డిజిల్లా: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గంలో గ్రేటర్ కేడర్‌కు పెద్దపీట వేసింది. మొత్తం 22 మందిని ఎంపిక చేయగా వీరిలో సగానికిపైగా హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డిజిల్లా నేతలే ఉండడం గమనార్హం. ఉపాధ్యక్షులుగా మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్, ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన మహిళా మోర్చ నాయకురాలు కొల్లి మాధవి, మాజీ మేయర్ బండారు కార్తీకారెడ్డి నియమితులయ్యారు. ప్రధాన కార్యదర్శులుగా పార్టీ హైదరాబాద్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎస్.గౌతంరావు, రంగారెడ్డి జిల్లా సీనియర్ నాయకుడు టి.వీరేందర్‌గౌడ్, కార్యదర్శిగా ఎస్సీ మోర్చ మాజీ అధ్యక్షుడు కొప్పు బాష, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె బండారు విజయలక్ష్మి, సీనియర్ నేత బద్దం మహిపాల్‌రెడ్డి నియమితులయ్యారు. సంయుక్త కోశాధికారిగా సువర్ణజైన్, చీఫ్ స్పోక్‌పర్సన్‌గా ఎన్‌వీ సుభాష్ నియమితులయ్యారు. పార్టీ అనుబంధ సంఘాలకు సైతం బాధ్యులను ఎంపిక చేశారు. యువ మోర్చ అధ్యక్షుడిగా మొయినాబాద్‌కు చెందిన గణేశ్‌కుండే, మహిళా మోర్చ అధ్యక్షురాలిగా మేకల శిల్పారెడ్డి, ఓబీసీ మోర్చ అధ్యక్షుడిగా గందమల్ల ఆనంద్‌గౌడ్‌ను నియమించారు.

చైర్మన్ల పవర్ కట్

- జిల్లాలో 37 పీఏసీఎస్‌లకు తొమ్మిది తొలగింపు
- ఉత్తర్వులు జారీ చేసిన డీసీసీబీ ఉన్నతాధికారులు
- ఒకటి, రెండు రోజుల్లో కొత్త చైర్మన్ల నియామకం
- ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ ఇన్‌చార్జులదే కీలకపాత్ర

యాచారం: జిల్లాలో తొమ్మిది మంది పీఏసీఎస్ చైర్మన్లను పదవుల నుంచి తొలగిస్తూ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత బీఆర్‌ఎస్ సర్కార్ హయాంలో 2020 ఫిబ్రవరి 15న పీఏసీఎస్‌లకు, ఫిబ్రవరి 16న చైర్మన్ల ఎన్నిక ప్రక్రియ పూర్తయింది. 2025 ఫిబ్రవరి 15తో ఐదేళ్ల పదవీ కాలం పూర్తయింది. కాంగ్రెస్ సర్కార్ పాలకవర్గాల పదవీ కాలాన్ని మొదట ఆరు నెలల (ఆగస్టు 14) పాటు పొడిగించింది. ఆగస్టు 15న రెండో దఫా మరో ఆరు నెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కానీ గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు లేకపోవడంతో ప్రొటోకాల్ వ్యవహారంలో మండల స్థాయిలో పీఏసీఎస్ చైర్మన్లే కీలకంగా మారారు. ఇది ప్రభుత్వ పెద్దలకు నచ్చలేదు. అత్యధికంగా పీఏసీఎస్‌ల్లో బీఆర్‌ఎస్ సర్కార్ హయాంలో గెలుపొందిన ఆ పార్టీకి చెందిన వారే ఉన్నారని, కాంగ్రెస్ అధికారంలో ఉండగా వాళ్ల పెత్తనం ఏమిటని పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు జీర్ణించుకోవడం లేదు. ఈ క్రమంలో ఆయా నియోజవర్గాల ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీల ఇన్‌చార్జిల ఒత్తిళ్లకు తలొగ్గిన సర్కార్ వారు సూచించిన చైర్మన్లకు మాత్రమే ఆరు నెలల పదవీ కాలాన్ని పొడిగిస్తు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో 37 పీఏసీఎస్‌లకు గాను తొమ్మిదింటికి ఉద్వాసన పలికింది. తొలగించిన తొమ్మిది పీఏసీఎస్ చైర్మన్లల్లో నలుగురు డీసీసీబీ డైరెక్టర్లు సైతం ఉన్నారు.



యాచారం పీఏసీఎస్ కార్యాలయం

ఎమ్మెల్యేలే కీలకం

ప్రస్తుతం జిల్లాలో పవర్ కట్ చేసిన తొమ్మిది పీఏసీఎస్‌ల్లో కొత్త వారిని ఎవరిని చైర్మన్ల సీటులో కూర్చోబెట్టాలన్న విషయంలో ఎమ్మెల్యేలే కీలకం కానున్నారు. నాలుగైదు రోజుల క్రితమే ఏ పీఏసీఎస్‌లో ఎవరు చైర్మన్‌గా ఉండాలనే విషయమై ఎమ్మెల్యేలు వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు నివేదిక పంపారు. రెండు, మూడు రోజుల్లో కొత్త చైర్మన్ల పేర్లు ప్రకటించే అవకాశం ఉంది.

పవర్ కట్ చేసిన పీఏసీఎస్‌లు ఇవే..

ఎంపీ పటేల్‌గూడ, ఆర్‌కే మైలారం, మాడ్గుల, ఆమనగల్లు, యాచారం, బాటాసింగారం, కందుకూరు, పాల్మాకుల, మహేశ్వరం.

జర్నలిస్టులపై దాడులను సహించం

టీయూడబ్ల్యూజేఎఫ్ డివిజన్ అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్



ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌తో మాట్లాడుతున్న జర్నలిస్టులు

నందిగామ: జర్నలిస్టు సందీప్‌పై అకారణంగా దాడి చేసిన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టులపై దాడులు చేస్తే ఎంతటి వారైన సహించేది లేదని టీయూడబ్ల్యూఎఫ్ డివిజన్ అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ అన్నారు. మండలానికి చెందిన జర్నలిస్టు సందీప్‌పై నందిగామకు చెందిన కొంతమంది యువకులు గణేశ్ నిమజ్జనం రోజు మూకుమ్మడిగా దాడి చేసి గాయపర్చారు. ఈ నేపథ్యంలో షాద్‌నగర్ నియోజకవర్గ జర్నలిస్టులు సోమవారం పెద్దఎత్తున నందిగామ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌తో వారు మాట్లాడుతూ.. అధికార పార్టీకి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి సూచనల మేరకు కొంత మంది యువకులు జర్నలిస్టు సందీప్‌పై అకారణంగా దాడి చేశారన్నారు. దాడి జరిగి రెండు రోజులైనా కూడా నేటి వరకు చర్యలు ఎందుకు తీసుకోలేదని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ.. కేసు విచారణ జరుపుతున్నామని, నిజనిజాలు తెలుసుకొని దాడికి పాల్పడిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టు నాయకులు ఖాజా పాషా, నరేశ్, లక్కాకుల రమేశ్, ఆంజనేయులుగౌడ్, నర్సింహారెడ్డి, యాదయ్య, వెంకన్నబాబు, చంద్రశేఖర్, నూరోద్దీన్, జగన్, మధుసూదన్ గౌడ్, శ్రీహరి, మహేశ్, వెంకటేశ్, అశోక్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆ స్తంభాలను తొలగించండి

- లేదంటే ఆత్మహత్య చేసుకుంటా
- సబ్‌స్టేషన్ ఎదుట రైతు ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న మల్లప్ప

మంచాల: తమ పొలంలో నాటిన విద్యుత్ స్తంభాలను తొలగించాలని ఓ రైతు సోమవారం పెట్రోల్ డబ్బాతో సబ్ స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి జాపాల గ్రామానికి చెందిన బక్కన మల్లప్పకు చెందిన వ్యవసాయ పొలం నుంచి శనివారం ప్రక్క రైతు వ్యవసాయ బోరుకు విద్యుత్ కనెక్షన్ నిమిత్తం విద్యుత్ స్తంభాలను అమర్చారు. విషయం తెలుసుకున్న మల్లప్ప.. తమకు సమాచారం ఇవ్వకుండా పొలంలో స్తంభాలు ఎలా ఏర్పాటు చేశారని, వెంటనే వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఏఈ బాజీసింగ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, ఆ పోల్స్‌ను తొలగిస్తామని హామీ ఇచ్చాడు. రెండు రోజులు అయినా వాటిని తొలగించలేదని పేర్కొంటూ.. తాజాగా బాధిత రైతు నిరసన వ్యక్తం చేశారు. వాటిని తీయకుంటే ఆత్మహత్య చేసుకుంటానని ఆందోళన వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ.. లేబర్ రాగానే మంగళవారం ఉదయం ఆ స్తంభాలను తొలగిస్తామని బాధిత రైతుకు హామీ ఇచ్చారు. అయినా సదరు వ్యక్తి వినకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు మల్లప్పను ఠాణాకు తరలించారు.

కుంగిన 'బావి'



రోడ్డు పక్కనే కుంగిన బావి

శంకర్‌పల్లి: మండల పరిధిలోని జన్వాడలో గతంలో తాగునీటి కోసం ఉపయోగించే బావి నాలుగు రోజుల క్రితం కుంగింది. దీంతో అధికారులు అప్రమత్తమై.. దాని దగ్గరకు ఎవరూ వెళ్లకుండా చుట్టూ బారికేడ్లను ఏర్పాటు చేశారు. బావి పక్కన విద్యుత్ స్తంభం కోసం గుంతను తవ్వి, దానిని నిలబెట్టారని, అది క్రమంగా భారీ గుంతగా మారి విద్యుత్ స్తంభం నెలకొరిగిందని గ్రామస్తులు తెలిపారు. దీంతో పక్కనే ఆనుకొని ఉన్న బావి సైతం కుంగిందని పేర్కొన్నారు. ఏళ్లనాటి బావి కుంగడంపై ఆ గ్రామస్తులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే దానిని పునరుద్ధరించాలని అధికారులను కోరుతున్నారు.

56 గ్రాముల గంజాయి పట్టివేత

కడ్తాల్: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని సోమవారం పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి నుంచి 56 గ్రాముల గాంజాను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన కల్యాణ్, మహబూబ్‌నగర్ జిల్లా ఉర్కొండ మండలం మాచర్ల గ్రామ సమీపంలోని కాటన్‌మిల్‌లో పనిచేసే ఓ గుర్తు తెలియని వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలుచేసి విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో కల్యాణ్ మిత్రుడు ఆమనగల్లుకు చెందిన రాజ్‌కుమార్.. గంజాయి కావాలని అడగడంతో ఈ నెల 6వ తేదీన రూ.4,500లు వెచ్చించి, 25 ప్యాకెట్లను కొనుగోలు చేశాడు. అనంతరం కడ్తాల్ మండల పరిధి కర్కల్‌పహాడ్ ధరణి వెంచర్ వద్దకు రావాలని రాజ్‌కుమార్‌కు సమాచారం ఇచ్చాడు. దీంతో రాజ్‌కుమార్.. అదే రోజు సాయంత్రం.. మరో మిత్రుడు వంశీతో కలిసి వెంచర్ వద్దకు వెళ్లారు. కల్యాణ్ నుంచి గంజాయిని కొనుగోలు చేస్తుండగా.. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడులు చేసి, ముగ్గురు వ్యక్తులను పట్టుకున్నారు. గంజాయితో పాటు, ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

వాగ్దేవి లాబొరేటరీస్ డీసీఏ పరిధిలోకి రాదు..

స్పష్టం చేసిన డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్..

సాక్షి, సిటీబ్యూరో: మెఫెడ్రోన్ స్వాధీనానికి సంబంధించి మహారాష్ట్ర పోలీసులు ఇటీవల విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్న చర్లపల్లిలోని వాగ్దేవి లాబొరేటరీస్ రసాయన కర్మాగారమని, డ్రగ్ లైసెన్స్ హోల్డర్ కాదని, అంతేకాకుండా ఫార్మాస్యూటికల్ కంపెనీ కూడా కాదని తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ స్పష్టం చేసింది. మెఫెడ్రోన్ ఔషధం కాదని, తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ దీనిని నియంత్రించదన్నారు. ఈ విషయం పూర్తిగా ఎన్‌డీపీఎస్ చట్టం 1985 కింద అధికారం పొందిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల 'పోలీస్ డిపార్ట్‌మెంట్, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ), డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్‌ఐ) ఇతర కేంద్ర/రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల' పరిధిలోకి వస్తుందని పేర్కొన్నారు. ఈ ఘటనలో ఎటువంటి చర్యలు లేదా దర్యాప్తును ప్రారంభించడానికి డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్‌కు అధికారం లేదని ఆ శాఖ అధికారులు పేర్కొన్నారు.

డయాలసిస్ కేంద్రం.. కిడ్నీ రోగులకు వరం

మహేశ్వరం ప్రభుత్వ ఆస్పత్రిలోని డయాలసిస్ కేంద్రం కిడ్నీ రోగులకు వరంగా మారింది. ఉచితంగా మెరుగైన సేవలు అందిస్తూ భారీ ఊరట కలిగిస్తోంది. నిత్యం 15 మంది మెరుగైన వైద్య చికిత్స పొందుతూ ఉపశమనం పొందుతున్నారు.

రోజు మూడు షిఫ్టుల్లో మెరుగైన సేవలు
- బాధితులకు ఊరట
- తగ్గిన దూర, ఆర్థిక భారం



చికిత్స పొందుతున్న రోగులు

మహేశ్వరం: మహేశ్వరంలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రం రోగులకు వరంలా మారింది. గతంలో ఇక్కడ సెంటర్ లేకపోవడంతో బాధితులు నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రులకు పురుగులు తీసేవారు. రూ.3 వేల నుంచి ఐదు వేలు వెచ్చించి చికిత్స చేయించుకునే వారు. ఈ నేపథ్యంలో ఇక్కడి రోగుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం.. మండల కేంద్రంలోని ధర్మాసుపత్రిలో 2018లో ఐదు పడకల డయాలసిస్ సెంటర్‌ను నెలకొల్పింది.

ఉచిత ప్రయాణం..

రోగులు ఉన్న ప్రాంతం నుంచి రక్తశుద్ధి కేంద్రానికి వచ్చేందుకు వీలుగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ వసతిని కల్పించింది. ప్రభుత్వ ఒప్పందంతో అఫెక్స్ కిడ్నీకేర్ ప్రైవేట్ కంపెనీ.. ఆదీనంలోని డయాలసిస్ కేంద్రాల్లో రక్తశుద్ధి ప్రక్రియను ఉచితంగా చేయిస్తూ బాధితుల్లో మనోధైర్యాన్ని నింపుతోంది. చికిత్సతో పాటు ఉచితంగా సూది మందు ఇస్తోంది.

మూడు విడతలుగా..

మండల కేంద్రంలోని డయాలసిస్ కేంద్రానికి మహేశ్వరం, కందుకూరు, కడ్తాల్, ఆమనగల్లు తదితర మండలాల నుంచి సుమారు 30 మంది రోగులు వస్తుంటారు. ప్రతి రోజు మూడు షిఫ్టుల్లో సేవలందిస్తున్నారు. ఉదయం 7 నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు, 3.30 నుంచి రాత్రి 7.30 చికిత్స అందిస్తున్నారు.

మరో కేంద్రం ఏర్పాటు

ప్రతి బాధితుడికి వారంలో మూడు రోజుల పాటు ముందస్తుగా కేటాయించిన సమయం ప్రకారం సేవలు అందుతాయి. ఒక్కో వ్యక్తికి నాలుగు గంటల పాటు రక్తశుద్ధి ప్రక్రియ కొనసాగుతోంది. గతంలో డయాలసిస్ కోసం రోగులు నగరంలోని గాంధీ, ఉస్మానియా, ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లేవారు. అక్కడ పేర్లు నమోదు చేసుకొని గంటల తరబడి నిరీక్షించేవారు. ప్రస్తుతం ఆ బాధలేదని బాధితులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా.. ప్రస్తుత కేంద్రానికి రోగుల సంఖ్య పెరుగుతోంది. త్వరలో మరో ఐదు పడకల కేంద్రం ఏర్పాటు కోసం ప్రణాళిక సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు.

జీవితం సాఫీగా..



చాలా కాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాను. 2019 నుంచి సర్కారు దవాఖానాలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రంలో చికిత్స పొందుతున్నాను. ఉచితంగా మెరుగైన సేవలు అందుతున్నాయి. ఆర్థిక సమస్య లేకుండా జీవితం సాఫీగా సాగుతోంది.

– సాల్మన్‌రెడ్డి, రోగి, ధన్నారం

వినియోగించుకోండి



కార్పొరేట్ స్థాయిలో ఉచిత సేవలను అందిస్తున్నాం. బాధితులు వినియోగించుకోండి. ప్రైవేట్ ఆస్పత్రుల్లో రూ.5 వేల నుంచి 10 వేల ఖర్చువుతుంది. ప్రస్తుతానికి రోజు 30 మంది కిడ్నీ బాధితులు వస్తున్నారు. 15 మందికి చికిత్స అందిస్తున్నాం. ఆరోగ్యశ్రీ కార్డుదారులకు ఉచిత సేవలు అందిస్తున్నాం.

– నవీన్, డయాలసిస్ కేంద్రం, ఇన్‌చార్జి, మహేశ్వరం

సౌకర్యాలు కల్పిస్తున్నాం



రోగులకు నిత్యం సేవలు అందిస్తున్నాం. రోజు మూడు షిఫ్టుల్లో 15 మందికి డయాలసిస్ చేస్తున్నాం. బాధితులకు సౌకర్య వంతంగా అన్ని వసతులను కల్పిస్తున్నాం. రోగుల సంఖ్య పెరిగితే పడకలు, యంత్రాలను పెంచుతున్నాం. మహేశ్వరం కేంద్రంలో కార్పొరేట్ స్థాయిలో సేవలు అందిస్తున్నాం.

– డాక్టర్ అమీర్ సిద్దిఖీ, సూపరింటెండెంట్, మహేశ్వరం

బైకు దొంగల అరెస్టు

- నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏసీపీ లక్ష్మీనారాయణ



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ లక్ష్మీనారాయణ

షాద్‌నగర్‌రూరల్: ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైకులను దొంగతనం చేస్తున్న ఇద్దరు దుండగులను సోమవారం షాద్‌నగర్ పోలీసులు అరెస్టు, చేసి రిమాండ్‌కు తరలించారు. ఏసీపీ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. కందుకూరు మండలం దావుద్‌గూడ తండాకు చెందిన శివ, కొత్తూరు మండలం కొడిచర్ల గ్రామానికి చెందిన బ్యాగరి రాంచందర్‌లు స్నేహితులు. వీరు షాద్‌నగర్ ఠాణా పరిసర ప్రాంతాల్లోని ఇళ్ల ఎదుట పార్కింగ్ చేసిన బైకులను అపహరిస్తున్నారు. ఈ క్రమంలో పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన వెంకటేశ్వర్లుకు చెందిన ద్విచక్ర వాహనం జూలై నెలలో చోరికి గురైంది. ఇదే విషయమై సదరు బాధితుడి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి బైకు దొంగలను గుర్తించారు. నిందితుల నుంచి సుమారు రూ.2 లక్షల విలువ చేసే 4 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని, వారిని రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా కేసు ఛేదించిన సీఐ విజయ్‌కుమార్, డీఎస్‌ఐ శివారెడ్డి, కానిస్టేబుళ్లు రవీందర్, సంతోష్, కరుణాకర్, జాకీర్‌లను ఏసీపీ అభినందించి, రివార్డులు అందజేశారు.

నిర్మాత అల్లు అరవింద్‌కు షోకాజ్ నోటీసులు

బంజారాహిల్స్: నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణం చేపట్టిన ప్రముఖ సినీ నిర్మాత అల్లు అరవింద్‌కు చెందిన భవనానికి ఎందుకు కూల్చవద్దో చెప్పాలంటూ జీహెచ్‌ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్–18 టౌన్‌ప్లానింగ్ అధికారులు సోమవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–45లో సినీ నిర్మాత అల్లు అరవింద్‌కు చెందిన 8-2-293/82/775/ఏ లో 996 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ప్లాట్ ఉంది. సదరు స్థలంలో అల్లు అరవింద్ నిర్మాతగా గీత ఆర్ట్స్ కార్యాలయం కొనసాగుతోంది. ఈ భవన నిర్మాణానికి జీహెచ్‌ఎంసీ నుంచి రెండు సెల్లార్లతో పాటు జీ ప్లస్ 4 అనుమతులు పొందారు. అయితే అనుమతులకు విరుద్ధంగా ఒక అంతస్తును అక్రమంగా నిర్మించారు. ఈ విషయాన్ని గుర్తించిన జీహెచ్‌ఎంసీ అధికారులు షోకాజ్ నోటీసు జారీ చేస్తూ ఎందుకు కూల్చవద్దో చెప్పాలంటూ పేర్కొన్నారు. ప్లాన్‌కు విరుద్ధంగా అక్రమ అంతస్తు ఎలా నిర్మిస్తారంటూ ప్రశ్నించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

మియాపూర్: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సూర్యపేట జిల్లా నాగారం గ్రామానికి చెందిన ఓర్స్ శ్రీను(39) కుటుంబంతో సహా నగరానికి వలస వచ్చి పాపిరెడ్డి కాలనీలో ఉంటూ కంప్రెషర్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం మియాపూర్, ప్రశాంత్ నగర్ కాలనీలో భవన నిర్మాణ పనుల్లో పాల్గొనేందుకు వచ్చాడు. అక్కడ ఉన్న బండను కంప్రెషర్‌తో తొలగిస్తుండగా సమీపంలోని బోరు మోటర్ విద్యుత్ తీగ తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. తోటి కార్మికులు అతడిని సమీపంలోని శ్రీకర ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. దీనిపై సమాచారం అందడంతో మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద సంఖ్యలో ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. భవన నిర్మాణదారుడిపై చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళన చేస్తున్న వారికి నచ్చజెప్పి అక్కడినుంచి పంపించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాల్కనీ లోనుంచి దూకి వృద్ధుడి ఆత్మహత్య

మూసాపేట: తన ఇంటి బాల్కనీలో నుంచి దూకి ఓ వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి పెందుర్తి వీర్రాజు (67) భార్యతో కలిసి మూసాపేటలోని మెరీనా స్కైస్‌లో ఫ్లాట్ నెంబర్ 1913లో నివాసం ఉంటున్నాడు. గత కొన్నేళ్లుగా అతను నరాల బలహీనత సమస్యతో బాధపడుతూ ఉన్నాడు. పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందినా వ్యాధి నయం కాకపోవడంతో మనస్తాపానికి లోనైన వీర్రాజు సోమవారం ఉదయం తన ఇంటి బాల్కనీ లోనుంచి కిందికి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తప్పని యూరియా కష్టాలు



ఉప్పరిగూడ పీఏసీఎస్ వద్ద యూరియా కోసం రైతుల క్యూ

ఇబ్రహీంపట్నం: కర్షకులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. శేరిగూడలోని ఉప్పరిగూడ పీఏసీఎస్‌కు సోమవారం 300 బ్యాగుల(15 టన్నులు) యూరియా వచ్చింది. విషయం తెలియగానే నిమిషాల వ్యవధిలోనే పెద్ద సంఖ్యలో రైతులు అక్కడికి చేరుకున్నారు. పోలీసుల సహకారంతో రైతుల ఆధార్, పాస్‌బుక్స్‌ను తీసుకొని రెండు బ్యాగుల చొప్పున పంపిణీ చేశారు. యూరియా అందని వారు నిరాషతో ఇంటిబాట పట్టారు. మంగల్‌పల్లి సొసైటీలో కేవలం 5 టన్నులు మాత్రమే పంపిణీ చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి బలవన్మరణం

ఉప్పల్: కుటుంబ కలహాలు, అర్థిక ఇబ్బందుల కారణంగా ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జనగాం జిల్లా, కోటిగల్లు ప్రాంతానికి చెందిన మహేందర్(30), గీతాంజలి దంపతులు నగరానికి వలస వచ్చి బీరప్పగడ్డలో నివాసముంటున్నారు. మహేందర్ రాణిగంజ్‌లో ఆర్వో వాటర్ టెక్నిషియన్‌గా పని చేస్తుండగా అతడి భార్య ప్రైవేట్ అసుపత్రిలో నర్సుగా పని చేస్తుంది. గత కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. దీంతో మనస్తాపానికి లోనైన మహేందర్ సోమవారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న ఉప్పల్ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పట్టించుకోరు.. పరిష్కరించరు

కలెక్టరేట్‌లో అర్జీదారుల ఆవేదన
- ట్రిపుల్ ఆర్ వద్దంటూ రైతుల ఆందోళన
- ప్రజావాణికి వినతుల వెల్లువ



ట్రిపుల్ ఆర్ వద్దంటూ కలెక్టరేట్ నారాయణరెడ్డికి ఫిర్యాదు అందజేస్తున్న రైతులు

ఇబ్రహీంపట్నం రూరల్: 'ఎన్నో సమస్యలతో ఎంతో దూరం నుంచి వ్యయప్రయాసాలకు ఓర్చి కలెక్టరేట్‌కు వస్తున్నాం. అయినా మమ్మల్ని ఎవరూ పట్టించుకోరు. సమస్య వినరు. దరఖాస్తులు తీసుకొని, పొమ్మంటున్నారు. కానీ సమస్యలు తీర్చడం లేదు' అని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టర్‌లో నిర్వహించిన ప్రజావాణికి దరఖాస్తులతో ప్రజలు బారులు తీరారు. సమస్యలు తీర్చాలని ఏళ్లుగా తిరుగుతున్నా పరిష్కారం కావడం లేదని కలెక్టర్ తదితర అధికారుల ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజావాణిని మొక్కుబడిగా నిర్వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 64 అర్జీలను అధికారుల స్వీకరించారు.

ప్రాణాలైనా ఇస్తాం..

చిన్నసన్నకారు రైతులు సాగు చేసుకొంటూ జీవనోపాధి పొందుతన్న భూముల నుంచి ట్రిపులఆర్ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం అలైన్‌మెంట్ చేసిందని కేశంపేట మండలం రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. మండల పరిధి తొమ్మిదిరేకుల గ్రామంలో 1420 ఎకరాల భూమిని 1518 మంది సాగు చేసుకొంటున్నామని తెలిపారు. ఈ భూముల్లోకి రోడ్డు వేయడానికి వీల్లేదని, అలా చేస్తే తామంతా రోడ్డున పడతామని వాపోయారు. మాడ్గుల మండలం కలకొండ చంద్రాయన్‌పల్లిలో భూములను రోడ్డు కోసం తీసుకున్నారని పేర్కొన్నారు. పెద్దలను వదిలి.. పేదల భూముల్లో రోడ్డు తీయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఎమ్మెల్యేల భూముల్లోంచి ఉన్న అలైన్‌మెంట్ మార్చడం సిగ్గుచేటన్నారు. ప్రాణాలైన ఇస్తాం.. కాని భూములు ఇవ్వమన్నారు. కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వగా.. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఆయన హామీ ఇచ్చారు.

ఇల్లు ఇవ్వకుంటే చచ్చిపోతా



ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. ఇల్లు ఇవ్వకుంటే చచ్చిపోతాను. లంచం ఇస్తేనే ఇల్లు ఇస్తామని కొందరు అంటున్నారు. ఇదే విషయమై అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు.

– సుల్తానాబేగం, రాజేంద్రనగర్

ఇందిరమ్మ బిల్లు ఇవ్వాలి



నా భార్య ఎక్కాల మనీష పేరిట ఇల్లు వచ్చింది. బేస్‌మెంట్ వరకు నిర్మాణం పూర్తిచేసి 74 రోజులు గడిచింది. అయినా బిల్లు రావడం లేదు. బిల్లు ఇవ్వమంటే పీడీ నుంచి ఏఈ, ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శి అందరూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

–ప్రభాకర్, కందుకూరు

నాలుగేళ్లుగా తిరుగుతున్నా



మంచాల మండలం, అజ్జిన తండాల్లో మానాన్న పేరిట భూమి ఉంది. సర్వే నంబరు మిస్సింగ్ గురించి దరఖాస్తు చేసుకున్నాము. నాలుగేళ్లుగా తిరుగుతున్నాం. ఆర్డీఓ మొదలు తహసీల్దార్ వద్దకు తిరగని రోజు లేదు. కలెక్టర్ దగ్గరకు వస్తే అక్కడ భూమి లేదని చెబుతున్నారు. ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. మాకు న్యాయం చేయాలి.

– సరిత, గిరిజన మహిళ

భూమి అమ్మలేదని..



మాకు తుక్కుగూడలో మూడు ఎకరాల భూమి ఉంది. ఇటీవల వట్రీక్స్ పేరుతో గొడవలు జరిగాయి. ప్రభుత్వ అధికారులు వచ్చి సీలింగ్ భూములని హద్దులు వేశారు. భూమి అమ్మలేదన్న అక్కసుతో కొందరు నాయకులు కావాలనే మమ్మల్ని ఇబందులకు గురిచేస్తున్నారు. మీకు భూమి లేదని హెచ్చరిస్తున్నారు. మా భూమి మాకు ఇప్పించాలి.

– ప్రకాష్‌రెడ్డి, తుక్కుగూడ